క్లుప్తంగా

తల్లి సమాధి వద్ద నివాళులు



నివాళులర్పిస్తున్న ఎంపీ సురేష్ షెట్కార్

నారాయణఖేడ్: ఎంపీ సురేష్ షెట్కార్ తన తల్లి సమాధి వద్ద నివాళులర్పించారు. తల్లి చంద్రమ్మ షెట్కార్ 14వ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం వ్యవసాయ క్షేత్రంలోని తల్లిసమాధిపై పూలమాలలువేసి నివాళులర్పించారు. కుటుంబీకులు తదితరులు సైతం సమాధివద్ద శ్రద్ధాంజలి ఘటించారు.

నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలి

వట్‌పల్లి(అందల్): మార్కెట్ కమిటీ నామినేటెడ్ పోస్టుల భర్తీలో వికలాంగులకు అవకాశం కల్పించాలని కోరుతూ సోమవారం వికలాంగులు వట్‌పల్లి ఏఎంసీ సూపర్‌వైజర్ పండరినాథ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అందోలు డివిజన్ వికలాంగుల సంఘం అధ్యక్షుడు సుభాష్‌నాయక్, మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షుడు కలీల్ మియా, కార్యదర్శి నర్సింలు, కోశాధికారి అఖిల్, ధన్‌సింగ్, జమాలుద్దీన్ పాల్గొన్నారు.

ఆయుర్వేదంతో ఆయువు వృద్ధి

కంగ్టి(నారాయణఖేడ్): ఆయుర్వేద ఔషధాల వినియోగంతోనే ఆయువు వృద్ధి చెందుతుందని కంగ్టి పీహెచ్‌సీ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ నారాయణరావు అన్నారు. సోమవారం కంగ్టిలో నిర్వహించిన వృద్ధుల ఆయుర్వేద శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నాగమణి, తహసీల్దార్ విష్ణుసాగర్, ఎంపీడీఓ సత్తయ్య, ఎంపీఓ సుభాష్ ప్రారంభించారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్సులు, ఏఎన్‌ఎంలు, 108 సంగ్‌శెట్టి, తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జైలు, జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జైలు, జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ కథనం మేరకు.. శనివారం, ఆదివారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 14 మందిని పట్టుకున్నాం. పట్టుబడిన వాహనదారులను సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా జడ్జి 14 మందికి ఒక్కొక్కరికి రూ.2 వేలు చొప్పున జరిమానా విధించారు. మరో వ్యక్తికి జరిమానాతోపాటు రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

కొండాపూర్(సంగారెడ్డి): మండల పరిధిలోని చెర్ల గోపులారం పాఠశాలలో సోమవారం ఇటీవలే బదిలీ అయిన ఉపాధ్యాయులకు మల్కాపూర్ కాంప్లెక్స్ హెచ్‌ఎం యాదగిరి సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మణ్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్ అనసూయ, గ్రామస్తులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల జారీలో అవకతవకలు

సదాశివపేట(సంగారెడ్డి): మున్సిపాలిటీలో జనన మరణ విభాగంలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న సిస్టం అసిస్టెంట్ కిషోర్ సర్టిఫికెట్ల జారీ అవకతవకలు చేయడంతో అతన్ని ఉద్యోగం నుంచి తొలగించామని మున్సిపల్ కమిషనర్ ఉమా తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జూన్ 12 నుంచి 21 వరకు కార్యాలయంలో జనన, మరణ విభాగంలో పని చేస్తున్న కిషోర్ ఆన్‌లైన్‌లో కమిషనర్ అనుమతి లేకుండా నోట్ ఫైల్ తయారు చేసి అప్రూవల్ చేసి ఎనిమిది బర్త్ సర్టిఫికెట్లను జారీ చేసి అవకతవకలకు పాల్పడినట్లు గుర్తించామని తెలిపారు. బంగ్లాదేశ్ వాస్తవ్యులకు బర్త్ సర్టిఫికెట్లు మున్సిపల్ నుంచి జారీ చేసినట్లు సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారం అవాస్తవమన్నారు.

ముత్తంగి కార్యదర్శిపై ప్రజావాణిలో ఫిర్యాదు

పటాన్‌చెరు టౌన్: ముత్తంగి కార్యదర్శి పై పటాన్‌చెరు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ముత్తంగి గ్రామానికి చెందిన గడీల కిరణ్ గౌడ్ రాతపూర్వక ఫిర్యాదును అందజేశారు. గ్రామంలో ప్రభుత్వ భూమితో పాటు తమ పట్టా భూమి సర్వే నెంబర్ 502లో ఓ వ్యక్తి అక్రమ నిర్మాణం చేశాడని, ఆ స్థలానికి పంచాయతీ అక్రమంగా ఇంటి నంబర్ ఇచ్చిందని ఫిర్యాదులో తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా పంచాయతీ అధికారి దృష్టికి తీసుకెళ్లగా విచారణ నిర్వహించి ఆ ఇంటి నంబర్ కేటాయింపు అక్రమం అని ఆర్డర్ ఇచ్చారని పేర్కొన్నారు. అక్రమ నిర్మాణం ఇంటి నంబర్ రద్దు చేయాలని డీపీఓ పంచాయతీకి ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. తహసీల్దార్ పంపిన బృందం కూల్చివేతలకు వస్తే గ్రామ కార్యదర్శి నవోద్ ఇతర కారణాలు చూపుతూ అక్రమ నిర్మాణానికి వత్తాసు పలికాడని చెప్పారు. అధికార దుర్వినియోగంకు పాల్పడుతున్న కార్యదర్శి పై చర్యలు తీసుకోవాలని కోరారు. అక్రమ నిర్మాణం తక్షణం కూల్చివేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయం పై పంచాయతీ కార్యదర్శి నవోద్ వివరణ కోరగా ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాలేదని, రాగానే నిర్మాణాన్ని తొలగిస్తామని తెలిపారు.

డాక్టర్లపై దాడులు అరికట్టాలి



పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్లు

సంగారెడ్డి : లేడీ డాక్టర్లపై దాడులను నిరసిస్తూ పట్టణంలో సోమవారం రాత్రి వైద్యులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఐటీఐ నుంచి ఐబీ అమర వీరుల స్థూపం వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా డాక్టర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చక్రపాణి మాట్లాడుతూ..పశ్చిమ బెంగాల్‌లోని కలకత్తాలో జరిగిన ఘటన అమానుషం అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు డాక్టర్‌లపై దాడులను అరికట్టి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. డాక్టర్ రాజు గౌడ్, శ్రీధర్, వెంకట్, ఆనంద్ నాయక్, పరుశురాం, గాయత్రి, శైలజ, శిల్ప పాల్గొన్నారు.

యువతరంతోనే నవ సమాజ నిర్మాణం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రత్న ప్రసాద్

కొండాపూర్(సంగారెడ్డి): యువతరంతోనే నవ సమాజం నిర్మాణమవుతుందని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కేఎస్ రత్నప్రసాద్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగాలు, సామాజిక శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ యువజన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ యువత అనుకుంటే ఏ లక్ష్యాన్నైనా సాధించగలుగుతుందని అన్నారు. యువత కలిగిన దేశం త్వరితంగా ఆర్థిక అభివృద్ధిని సాధిస్తుందన్నారు. యువతరం లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆ లక్ష్యసాధనకు నిరంతరంగా పాటుపడాలన్నారు. సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ వంటి వాటికి దూరంగా ఉన్నప్పుడే ఆరోగ్యవంతమైన దేశ నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. ప్రపంచంలో యువతను అధికంగా కలిగిన దేశాలలో భారత దేశం మొదటి వరుసలో ఉంటుందన్నారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జగదీశ్వర్, జ్యోష్న, మల్లిక, పి పద్మ, అనురాధ, డాక్టర్ సదయ్య కుమార్, డాక్టర్ సుమతి విద్యార్థులు పాల్గొన్నారు.

శివ పంచాక్షరీ నామం.. మోక్షానికి మార్గం

- జ్యోతిర్వాను విద్యాపీఠం వ్యవస్థాపకులు మహేశ్వరశర్మ సిద్ధాంతి



అనుగ్రహ భాషణం చేస్తున్న మహేశ్వరశర్మ

కంగ్టి(నారాయణఖేడ్): దైవనామ సంకీర్తనమే ముక్తికి మార్గమని..అందరు నిత్యం శివపంచాక్షరీ నామస్మరణ చేసి తరించాలని ఫసల్వాదీ జ్యోతిర్వాను విద్యాపీఠం వ్యవస్థాపకులు మహేశ్వర శర్మ సిద్ధాంతి అన్నారు. శ్రావణ మాసం రెండో సోమవారం పురస్కరించుకొని కంగ్టి శివారులోని పురాతన సిద్ధేశ్వర ఆలయంలో నిర్వహించిన పంచాక్షరీ నామ మహాజపయజ్ఞంలో ఆయన పాల్గొన్నారు. దారం సౌమ్య సంజయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాజపయజ్ఞం కనుల పండువగా కొనసాగింది. పలు ప్రాంతాల నుంచి వేలాదిగా వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు, కంగ్టి గ్రామం కిటకిటలాడింది. ఈ సందర్భంగా మహేశ్వర సిద్ధాంతి భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు దారం సౌమ్య సంజయ్ దంపతులతో పాటు దారం చంద్రకాంత్, ఆలయ కమిటీ చైర్మన్ దారం వెంకట్, ఈఓ శివరుద్రప్ప, వినోద్ కుమార్, నందు మహారాజ్, జైకిషన్ మహారాజ్, చైతన్య మహారాజ్ పాల్గొన్నారు.

ఇళ్ల మధ్య కల్లు దుకాణం వద్దు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

కంది(సంగారెడ్డి): ఇళ్ల మధ్య కల్లు దుకాణం పెట్టొద్దని సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట కంది గ్రామస్తులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇళ్ల మధ్య కల్లు దుకాణం ప్రారంభించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దుకాణానికి వచ్చే వారితో విద్యార్థులు, మహిళలకు ఇబ్బంది కలుగుతుందన్నారు. గ్రామ పొలిమేరలో నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం తహసీల్దార్ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీఓ మహేందర్ రెడ్డి, శిశు మందిర్ ప్రధాన ఆచార్యులు పండరయ్య, గ్రామస్తులు జానీ పాషా, శ్రీనివాస్ రెడ్డి, బాబు రావు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి



అధికారులతో కలిసి పైపులైన్ పనులను పరిశీలిస్తున్న అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్

పటాన్‌చెరు: కాలనీల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి సోమవారం అధికారులను ఆదేశించారు. మున్సిపల్ పరిధిలోని నరేంద్ర కాలనీలో రహదారులను, పీఎస్ఆర్ కాలనీ, సాయి అంబికా కాలనీల్లో చేపడుతున్న మంచినీటి పైపులైన్లు, పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయాలని సూచించారు. ప్రతీ ఇంటికి రక్షిత మంచినీరు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు అయినప్పుడే వాటికి సార్థకత చేకూరుతుందని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి, హెచ్‌ఎండబ్ల్యూఎస్ డీజీఎం చంద్రశేఖర్, కౌన్సిలర్ కృష్ణ, మున్సిపల్ ఏఈ ప్రవీణ్, కోఆప్షన్ సభ్యులు రాములు, సీనియర్ నాయకులు యాదగిరి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

అద్దెలు అందుబాటులో ఉండాలి : ఎమ్మెల్యే

జహీరాబాద్: శుభకార్యాలు జరుపుకునేందుకు వీలుగా పట్టణాలకు బ్యాంకెట్ హాళ్లు విస్తరించడం సంతోషకరమైన విషయమని, అద్దెలు సామాన్యుడికి అందుబాటులో ఉంచి సేవా దృక్పథం చూపాలని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. సోమవారం పట్టణంలో మున్సిపల్ మాజీ చైర్మన్ మంకాల్ సుభాష్‌కు చెందిన బ్యాంకెట్‌హాల్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, ఉజ్వల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

జహీరాబాద్: కోహీర్ మండలంలోని సజ్జాపూర్‌కు చెందిన పేద వైద్య విద్యార్థి బేగరి ప్రవీణ్‌కుమార్‌కు కాంగ్రెస్ జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఎన్ఆర్ఐ ఉజ్వల్‌రెడ్డి ఆర్థిక సహాయం అందజేశారు. సోమవారం జహీరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రూ.60 వేల చెక్కును విద్యార్థి కుటుంబ సభ్యులకు అందజేశారు.

సమస్యలు పరిష్కరించండి

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాయపరమైన తమ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే ఆందోళన చేస్తామని మండల సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. సోమవారం ఎమ్మార్సీ కార్యాలయం ఆవరణలో ఇటీవల మృతి చెందిన సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ.. ఉద్యోగ భద్రత కల్పించాలని, మృతి చెందిన ఉద్యోగుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలన్నారు. తమ సమస్యలను పరిష్కరించని పక్షంలో ఆందోళన చేపడుతామని ఉద్యోగులు రవి, మోహన్, రాజు, విశ్వనాథ్, జ్యోతి, మాణిక్, వైజ్యనాథ్, ప్రసాద్ తదితరులు హెచ్చరించారు.

సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేయాలి

పటాన్‌చెరు టౌన్ : ఇనుప విద్యుత్ స్తంభాల స్థానంలో సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ కోరారు. సోమవారం డివిజన్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ భాస్కర రావును కార్పొరేటర్ కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...డివిజన్ పరిధిలోని బండ్లగూడ, పటాన్‌చెరులోని కాలనీలలో 40 ఏళ్ల నాటి ఇనుప విద్యుత్ స్తంభాలు ఉన్నాయని వాటి ద్వారా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. వాటి స్థానంలో కొత్తగా సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేయాలని వినతి పత్రం ఇచ్చారు.

రైతులకు న్యాయం చేయాలి

సంగారెడ్డి టౌన్ : కొండాపూర్ మండలం గిర్మాపూర్, సదాశివపేట మండలం పెద్దాపూర్ గ్రామాలలో ట్రిపుల్‌ఆర్‌లో భూములు కోల్పోతున్న రైతులకు మార్కెట్ రేటు ప్రకారం మూడింతలు అదనంగా పరిహారం చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు, టీజేఎస్ జిల్లా అధ్యక్షులు తుల్జారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి వినతి పత్రం అందజేశారు.

ప్రతి ఇంటికి మువ్వన్నెల జెండా



అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని గ్రామాల్లో ఘనంగా జరుపుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు దర్జీ సుధాకర్ సూచించారు. సోమవారం మండల పరిధిలోని చందాపూర్‌లో బూత్ అధ్యక్షుడు వీరేందర్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద పరిసరాలను శుభ్రం చేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ద్వారా నేటి తరానికి తెలియజేయాలని పిలుపునిచ్చారు. దేశభక్తిని ప్రతి ఒక్కరు పెంపొందించుకునేలా పాటుపడాల్సిన బాధ్యత బీజేపీ కార్యకర్తలపై ఉందన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈనెల 13, 14 తేదీల్లో ప్రతి ఇంటికి మువ్వన్నెల జెండాను పంపిణీ చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు మోహన్ రెడ్డి, ఆదిత్య, వీరేందర్, శ్రీకాంత్, రమేష్, భరత్, మొగులయ్య, అనిల్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్యోద్యమంలో ఏఐఎస్ఎఫ్ కీలకపాత్ర



సంఘం జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

నారాయణఖేడ్: స్వాతంత్ర్యోద్యమంలో కీలక పాత్ర పోషించిన ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని ఆ సంఘం జిల్లా కన్వీనర్ దత్తురెడ్డి, జిల్లా నాయకులు ఆనంద్ అన్నారు. సోమవారం ఖేడ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద సంఘం 89వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పోరాటాలు, త్యాగాలే ధ్యేయంగా ఏర్పాటైన సంఘం ప్రభుత్వ విద్యా పరిరక్షణకు పోరాటాలు కొనసాగిస్తూ వస్తోందన్నారు. జిల్లా, డివిజన్ నాయకులు ఇసాక్, అశోక్, ఏఐటీయూసీ నాయకులు చిరంజీవి, విద్యార్థులు పాల్గొన్నారు.

త్రీఫేస్ కరెంట్ ఇవ్వాలని వినతి

సంగారెడ్డి రురల్: సంగారెడ్డి పట్టణంలోని 18వ వార్డు మధురానగర్ కాలనీలో త్రీఫేస్ కరెంట్ ఇవ్వాలని కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వార్డు కౌన్సిలర్ అశ్విన్, కాలనీ ప్రెసిడెంట్ సామల మురళి మాట్లాడుతూ.. 20 ఏళ్లుగా ఇక్కడ నివాసం ఉంటున్నామని, సుమారు 150 సర్వీస్ కనెక్షన్లు ఉన్నాయని తెలిపారు. త్రీఫేస్ కరెంటు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని వివరించారు. కార్యక్రమంలో కాలనీ కార్యదర్శి నరేందర్ గౌడ్, అర్జునయ్య, గోవర్ధన్, భూపాల్, రెడ్డి, బాలేష్, బాల్రాజ్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

- ఎమ్మెల్యే మాణిక్‌రావు



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. సోమవారం న్యాల్‌కల్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన 14 మందికి వేర్వేరుగా చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ ఉమ్మడి మెదక్ జిల్లా చైర్మన్ ఎం.శివకుమార్ పార్టీ మండలాధ్యక్షుడు రవీందర్ నాయకులు ప్రవీణ్, నర్సింహారెడ్డి మాజీ సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి రూరల్: పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో సంగారెడ్డి నియోజకవర్గ నాలుగు మండలాలు, రెండు మున్సిపాలిటీలకు సంబంధించిన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ లబ్ధిదారులకు అందజేశారు. మొత్తం 163 మంది లబ్ధిదారులకు రూ. 54.61 లక్షల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నరహరి రెడ్డి, శివరాజ్ పాటిల్, చింతా గోపాల్, కొండల్ రెడ్డి పాల్గొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న నర్సింలు

కంది(సంగారెడ్డి): కార్యాలయాల్లో అందుబాటులో ఉండని వ్యవసాయ అధికారుల పై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు నర్సింలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కందిలోని రైతు వేదిక వద్ద రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు.

సంక్షిప్త వార్తలు

◆ రైతులకు నిత్యాన్నదానం

మునిపల్లి(అందోల్): రైతు రుణమాఫీ కోసం బ్యాంకులకు వచ్చే రైతులకు కాంగ్రెస్ నాయకులు నరేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఉచిత భోజన సౌకర్యం కల్పించారు. సోమవారం మండల కేంద్రమైన మునిపల్లిలో ఎస్‌బీఐ బ్యాంకుకు రుణమాఫీ డబ్బుల కోసం వచ్చే రైతుల ఆకలి తీర్చడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు నరేందర్‌గౌడ్ తెలిపారు.

◆ సీసీ రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం

సంగారెడ్డి: పట్టణంలోని 23వ వార్డు శివాజీనాగర్‌లో రూ.6 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు సభ్యురాలు కూన వనిత, మున్సిపల్ ఏఈ రాహుల్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

◆ సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్ మండల పరిధిలోని హద్నూర్ గ్రామానికి చెందిన నర్సింహారెడ్డికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.60వేలు చెక్కును ఎమ్మెల్యే మాణిక్‌రావు అందజేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, బీఆర్ఎస్ మాజీ మండలాధ్యక్షుడు నర్సింహారెడ్డి, ప్రవీణ్‌కుమార్, కిరణ్ గౌడ్, సుభాష్ సేట్, మహేష్, స్వామిదాస్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

◆ పాఠశాలకు సౌండ్‌సిస్టమ్ వితరణ

నారాయణఖేడ్: పట్టణంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు సిర్గాపూర్ మండలం కడ్పల్‌కు చెందిన ప్రవాస భారతీయుడు వెంకటేశ్ యాదవ్ సహకారంతో ఆయన సోదరుడు రవి యాదవ్ సౌండ్ సిస్టమ్‌ను సోమవారం అందజేశారు. పాఠశాలలో ఉన్న 800 మంది విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండేందుకు సిస్టమ్‌ను అందజేసినట్లు దాత తెలిపారు.

◆ మై ఆటో ఈజ్ సేఫ్

మునిపల్లి(అందోల్): మై ఆటో ఈజ్ సేఫ్ స్టిక్కర్లను ప్రతీ ఆటోపై ఉండాలని బుదేరా ఎస్ఐ రాజేశ్‌నాయక్ ఆయా గ్రామాల ఆటో డ్రైవర్లు, ఓనర్లకు సూచించారు. సోమవారం మండలంలోని బుదేరా పోలీస్ స్టేషన్‌లో ఆయా ఆటోలకు మై ఆటో ఈజ్ సేఫ్ అనే స్టిక్కర్లను అతికించారు. అంతే కాకుండా స్టికర్ల మీద నంబర్లు ఉన్నాయి. కార్యక్రమంలో ఏఎస్ఐ ఎసయ్య, హనీఫ్, మల్లేశం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

◆ గణపతి దేవాలయ అర్చకుడికి అవార్డు

నారాయణఖేడ్: హైదరాబాద్ ఆసీఫ్ నగర్ దత్తాత్రేయ కాలనీలోని గణపతి దేవాలయ అర్చకులైన ఖేడ్ మండలం ర్యాకల్ గ్రామానికి చెందిన శివయ్య శర్మ ఆదివారం రాత్రి సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 'పురోహిత వైభవ బ్రహ్మ' అవార్డును అందుకున్నారు. స్వాతంత్ర్య దినోత్సవ నేపథ్యంలో హైదరాబాద్ లలితకళ సమాఖ్య, రుద్రాక్ష వైభవం, ఆధ్యాత్మిక పీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయావాటి బాధ్యులు అవార్డు అందజేశారు.

◆ వైభవంగా మహారుద్రయాగం

నారాయణఖేడ్: ఖేడ్ పట్టణంలోని చారిత్రాత్మకమైన కాశీనాథ్ ఆలయంలో శ్రావణ మాసం రెండవ సోమవారం పురస్కరించుకొని మహారుద్ర యాగ, రుద్రాభిషేకం కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు గురురాజ శర్మ ఆధ్వర్యంలో రుద్రాభిషేకం, రుద్రహోమం నిర్వహించారు.

◆ హాజరు శాతం పెంచండి

కంగ్టి(నారాయణఖేడ్): పిల్లలందరూ ప్రతీరోజు క్రమం తప్పకుండా బడికి వచ్చేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఎంఈఓ శంకర్ సూచించారు. సోమవారం కంగ్టి మండలంలోని భీంరా గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. 54 మంది విద్యార్థులకు గాను 32 మంది విద్యార్థులు మాత్రమే ఉండటంతో ఉపాధ్యాయులకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఇద్దరు ఉపాధ్యాయులు హాజరు కాగా ఒకరు సెలవుపై ఉన్నారు.

◆ రోడ్డుకు మరమ్మతులు చేపట్టండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూర్ ఓఆర్ఆర్ ఎగ్జిట్ 2వద్ద రోడ్డు అధ్వానంగా మారిందని స్థానికులు వాపోయారు. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరారు.

◆ వ్యక్తి అదృశ్యం

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : వ్యక్తి అదృశ్యమైన ఘటన రామచంద్రాపురం పట్టణంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని అశోక్‌నగర్‌లో నివాసం ఉండే వీరాంజనేయులు ఓ ప్రైవేట్ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. 11వ తేదీ రాత్రి డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. అదే రాత్రి వీరాంజనేయులు తన బామ్మర్దికి మీ చెల్లెల్ని, పిల్లల్ని తీసుకెళ్లండి.. బతికి ఉంటే ఆరు నెలల్లో వస్తాను అని వాట్సాప్ మెసేజ్ చేశాడు. ప్రైవేట్ లోన్ యాప్స్ వాళ్ల బెదిరింపుల కారణంగానే ఇలా జరిగి ఉండొచ్చని వీరాంజనేయులు భార్య ఫిర్యాదులో పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


◆ సీపీఎస్ రద్దు చేయాలి

సదాశివపేట(సంగారెడ్డి): ప్రభుత్వం సీపీఎస్ రద్దు చేసి, బిల్లును వెంటనే చెల్లించాలని తెలంగాణ నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాహుల్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. జైపాల్, వర ప్రసాద్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

◆ సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కొండాపూర్(సంగారెడ్డి): గ్రామాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని ఆత్మకమిటీ చైర్మన్ ప్రభు అన్నారు. సోమవారం మండల పరిధిలోని సీతారాంకుంట తండాలో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. నియోజకవర్గ ఆత్మ కమిటీచైర్మన్ ప్రభు, మార్కెట్ కమిటీ చైర్మన్ కుమార్‌తో కలిసి సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నర్సింహారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కిషన్ నాయక్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

◆ కూలిన చెట్టు



సంగారెడ్డి టౌన్ : ఈదురు గాలులతో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో వెనుక భాగంలో ఉన్న భారీ వృక్షం నేలకొరిగింది. రోడ్డు పై పడటంతో రాకపోకలకు కొంత ఇబ్బంది ఏర్పడింది.

◆ కంచె తొలగింపు

పుల్‌కల్(అందోల్) : మండల పరిధిలోని గొంగులూరులో ప్రభుత్వ భూమిని ఆక్రమించి వేసిన కంచెను తొలగించామని తహసీల్దార్ క్రిష్ణ తెలిపారు. గ్రామ శివారులో 189 సర్వేనంబర్‌లో కొందరు వ్యక్తులు అసైన్డ్ భూమిని ఆక్రమించి కంచెను నిర్మించారని చెప్పారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు ఆ కంచెను తొలగించామని వివరించారు. ఆక్రమణదారులను గుర్తించి కేసు నమోదు చేయాలని పోలీసులకు ఆదేశించినట్లు పేర్కొన్నారు. తెలిపారు.